ఎయిర్ ఫోర్స్‌లో అగ్నివీర్‌వాయు ఉద్యోగాలు

భారతీయ వాయుసేన అగ్నివీర్‌వాయు పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించింది. ఇంటర్మీడియట్ విద్యార్హతతో వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. మహిళలూ అర్హులే. పరీక్షలో చూపిన ప్రతిభ, ఫిజికల్, మెడికల్ టెస్టులతో నియామకాలు చేపడతారు. ఎంపికైనవారు నాలుగేళ్ల పాటు సేవలు అందించవచ్చు. ఆ తర్వాత వీరిలో 25 శాతం మంది శాశ్వత ఉద్యోగంలో కొనసాగుతారు. మిగిలినవారు ఆర్థిక ప్రోత్సాహకాలతో వైదొలగుతారు!

అగ్నివీర్‌వాయులో సైన్స్, నాన్ సైన్స్ విభాగాల్లో పోస్టులు ఉన్నాయి. సైన్స్ విభాగంలో పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారు నాన్ సైన్స్ ఖాళీలకూ పోటీ పడవచ్చు. ఇందుకోసం వీరు ప్రత్యేక పరీక్ష రాయాలి.

● **సైన్స్:** ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. లేదా నిర్దేశిత బ్రాంచీల్లో మూడేళ్ల డిప్లొమా కోర్సు 50 శాతం మార్కులతో పూర్తిచేయాలి. లేదా ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో రెండేళ్ల వొకేషనల్ కోర్సు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఏ విద్యార్హతతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ పది/ఇంటర్/డిప్లొమా/ఒకేషనల్ ఎందులోనైనా ఇంగ్లిష్‌లో 50 శాతం మార్కులు పొందడం తప్పనిసరి.

● **నాన్ సైన్స్:** ఏదైనా గ్రూప్‌తో ఇంటర్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా రెండేళ్ల ఒకేషనల్ కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఏ అర్హతతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ పది/ఇంటర్/ఒకేషనల్ ఇంగ్లిష్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరి.

● **ఎత్తు:** అన్ని విభాగాలకూ పురుషులు 152.5 సెం.మీ. మహిళలు 152 సెం.మీ. ఉండాలి. ఎత్తుకు తగ్గ బరువు అవసరం. ఊపిరి పీల్చినప్పుడు, వదిలినప్పుడు 5 సెం.మీ. వ్యత్యాసం తప్పనిసరి.

మూడు దశల్లో....

మూడు దశల్లో నిర్వహించే వివిధ పరీక్షలతో నియామకాలు చేపడతారు.

ఫేజ్–1

ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో వస్తాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. సైన్స్ సబ్జెక్టులకు పరీక్ష వ్యవధి ఒక గంట. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. నాన్ సైన్స్ వారికి పరీక్ష వ్యవధి 45 నిమిషాలు. ఇంగ్లిష్, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ అంశాల్లో ప్రశ్నలుంటాయి. సైన్స్, నాన్ సైన్స్ రెండింటికీ దరఖాస్తు చేసుకున్నవారికి పరీక్ష 85 నిమిషాలు ఉంటుంది. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు వస్తాయి. అన్ని పరీక్షల్లోనూ ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. అలాగే తప్పుగా గుర్తించిన ప్రతి జవాబుకూ పావు మార్కు తగ్గిస్తారు. అన్ని ప్రశ్నపత్రాల్లోనూ ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రశ్నలు సీబీఎస్ఈ 10+2 సిలబస్ నుంచే వస్తాయి. ఎంచుకున్న పరీక్షను బట్టి ఇంగ్లిష్ 20, ఫిజిక్స్ 25, మ్యాథ్స్ 25, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ 30 ప్రశ్నలు అడుగుతారు.

సన్నద్ధత: ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలు బాగా చదివి, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేసినవారు పరీక్షను సులువుగా ఎదుర్కోగలరు. మ్యాథ్స్, ఫిజిక్స్ విభాగాల్లో ప్రశ్నలకు ఎంసెట్ స్థాయిలో సన్నద్ధమైతే సరిపోతుంది. ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాల్లోని వ్యాకరణాంశాలపై దృష్టిపెడితే ఆ విభాగంలోనూ మెరుగైన స్కోరు పొందవచ్చు. రీజనింగ్ విభాగంలో ప్రశ్నలు మరీ లోతుగా ఉండవు. మాదిరి ప్రశ్నలు సాధనచేసి, మెరుగైన మార్కులు పొందవచ్చు. జనరల్ అవేర్‌నెస్ ప్రశ్నలకు.. ఇటీవలి కాలంలో రక్షణ విభాగంలో చోటుచేసుకున్న కీలక పరిణామాలకు ప్రాధాన్యమివ్వాలి. క్రీడలు, అవార్డులు, విజేతలు, పుస్తకాలు, రచయితలు, నియామకాలు, ఎన్నికలు... తాజా పరిణామాలపై దృష్టి సారిస్తే ఎక్కువ మార్కులు పొందవచ్చు.

ఫేజ్–2

ఫేజ్-1లో ప్రతిభ చూపితేనే ఫేజ్-2లో అవకాశం ఉంటుంది. ఎంపికైనవారు నిర్దేశిత సెలక్షన్ కేంద్రాలకు ప్రవేశపత్రాలతోపాటు అవసరమైన సర్టిఫికెట్లు, వాటి నకళ్లు, ఫొటోలు, సామగ్రిని తీసుకెళ్లాలి. ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగంగా 1.6 కి.మీ. దూరాన్ని పురుషులు 7, మహిళలు 8 నిమిషాల్లో చేరుకోవాలి. అలాగే పురుషులు ఒక్కోటీ నిమిషం వ్యవధిలో.. 10 పుష్‌అప్స్, 10 సిట్ అప్స్, 20 స్క్వాట్స్ పూర్తిచేయాలి. మహిళలు 90 సెకన్లలో 10 సిట్‌అప్స్, నిమిషంలో 15 స్క్వాట్స్ చేయగలగాలి. వీటన్నింటిలోనూ అర్హత సాధించిన వారికి అడాప్టబిలిటీ టెస్టు-1 నిర్వహిస్తారు. అభ్యర్థి ఎయిర్ ఫోర్స్ ఉద్యోగానికి సరిపోతాడో లేదో తెలుసుకోవడానికి ఆబ్జెక్టివ్ తరహాలో రాత పరీక్ష ఉంటుంది. ఇందులో అర్హత సాధించినవారికి అడాప్టబిలిటీ టెస్టు 2 ఉంటుంది. ఈ దశలో.. వాయుసేన వాతావరణానికి అభ్యర్థి అలవాటు పడగలడా లేదా పరిశీలిస్తారు.

ఫేజ్–3

అడాప్టబిలిటీ టెస్టులో ఉత్తీర్ణత సాధించినవారిని వైద్య పరీక్షలు నిర్వహించి శిక్షణ, నాలుగేళ్ల విధుల నిమిత్తం తీసుకుంటారు.

ప్రోత్సాహకాలు

అగ్నివీర్‌వాయులో అవకాశం వచ్చిన వారికి తొలి ఏడాది ప్రతి నెలా రూ.30,000 చెల్లిస్తారు. రెండో సంవత్సరం నెలకు రూ.33,000 వేతనం ఉంటుంది. మూడో ఏడాది రూ.36,500 అందుతుంది. నాలుగో సంవత్సరం రూ.40,000 ప్రతి నెలా చెల్లిస్తారు. వార్షిక సెలవులు 30 ఉంటాయి. ఆరోగ్య సమస్యను బట్టి సిక్ లీవ్ కేటాయిస్తారు. నాలుగేళ్ల సర్వీస్‌లో ఉన్నప్పుడు రిస్క్ అండ్ హార్డ్‌షిప్, రేషన్, డ్రెస్, ట్రావెల్ అలవెన్సులు అందిస్తారు. నాలుగేళ్లపాటు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ కవర్ వర్తిస్తుంది. నాలుగేళ్ల సేవలకు గానూ వారు పనిచేసిన విభాగాన్ని అనుసరించి అగ్నివీర్‌వాయు స్కిల్ సర్టిఫికెట్ అందుతుంది. వీరికి పింఛను, గ్రాట్యుటీ, కరవు భత్యం, మిలటరీ సర్వీస్ పే (ఎంఎస్‌పీ), ఎక్స్ సర్వీస్‌మెన్ హోదా ఇవేవీ వర్తించవు. ప్రొవిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఉండదు.

సేవానిధి..

ప్రతి నెలా అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్‌కి జమ చేస్తారు. అంటే మొదటి ఏడాది ప్రతి నెల పొందే 30,000 నుంచి రూ.9000 మినహాయిస్తారు. అగ్నివీర్‌వాయు చేతికి రూ.21,000 అందుతుంది. రెండో ఏడాది రూ.23,100 వేతనం అందుతుంది. రూ.9900 నిధిలో జమ అవుతుంది. మూడో ఏడాది రూ.25,500 చేతికి వస్తుంది. రూ.10,950 నిధికి వెళ్తుంది. ఇలా నాలుగో ఏడాదికి వచ్చే సరికి వీరునికి రూ.28,000, నిధికి రూ.12,000 వెళ్తాయి. మొత్తం నాలుగేళ్ల వ్యవధికి గానూ సేవానిధిలో రూ.5.02 లక్షలు అగ్నివీరుని నుంచి జమవుతుంది. అంతే మొత్తాన్ని ప్రభుత్వమూ జత చేస్తుంది. రెండూ కలిపి రూ.10.04 లక్షలవుతాయి. దీనికి వడ్డీని జతచేసి, అగ్నివీర్‌వాయుకి అందిస్తారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్/ఆంత్రప్రెన్యూర్‌షిప్ నిమిత్తం వీరికి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరయ్యేలా ఏర్పాట్లు చేస్తారు. కార్పొరేట్ సంస్థల్లోనూ అవకాశాలు ఉంటాయి. నాలుగేళ్ల సర్వీస్ మధ్యలో కావాలంటే వైదొలగొచ్చు. అలాంటి సందర్భంలో వేతనం నుంచి జమ అయిన మొత్తాన్నే అగ్నివీర్‌వాయుకి అందిస్తారు. ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహం దక్కదు.

ఉద్యోగంలోకి...

నాలుగేళ్ల వ్యవధి పూర్తిచేసుకున్న అగ్నివీర్‌వాయు ఒక్కో బ్యాచ్ నుంచి గరిష్ఠంగా 25 శాతం మందిని ఎయిర్‌ఫోర్స్‌లో శాశ్వత ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఇందుకోసం నాలుగేళ్ల వ్యవధిలో చూపిన ప్రతిభ, సంస్థ అవసరాలు ప్రామాణికంగా తీసుకుంటారు. సైన్స్ విభాగంలో అవకాశం వచ్చినవారు గ్రూప్-ఎక్స్ (ఫిట్టర్) విధులు నిర్వర్తిస్తారు. వీరికి మొదటి నెల నుంచే రూ.33,100 మూలవేతనం అందుతుంది. నాన్ సైన్స్ అభ్యర్థులు గ్రూప్ వై(టెక్నీషియన్) సేవలు అందిస్తారు. వీరికి రూ.26,900 మూలవేతనం చెల్లిస్తారు. ఈ రెండు ట్రేడులవారికీ డీఏ, హెచ్‌ఆర్‌ఎ, ఇతర అలవెన్సులు అందుతాయి. ఎక్స్ ట్రేడ్‌ల్లోనివారు మొదటి నెల నుంచే రూ.యాభై వేలకు పైగా, వై ట్రేడుల్లో చేరినవాళ్లు సుమారు రూ.45,000 వేతనం అందుకోవచ్చు. విధుల్లో కొనసాగినవారు భవిష్యత్తులో ప్రమోషన్ల ద్వారా మాస్టర్ వారెంట్ ఆఫీసర్ (ఎండబ్ల్యువో) స్థాయి వరకు చేరుకోవచ్చు. అలాగే సర్వీసులో కొనసాగుతూ కొన్ని పరీక్షల్లో అర్హతలు సాధించినవారు కమిషన్డ్ ఆఫీసర్లు కావడానికీ అవకాశాలు ఉన్నాయి. ఉద్యోగం చేస్తూనే నిర్ణీత వ్యవధితో ఉన్నత విద్య కొనసాగించడానికీ అనుమతిస్తారు. పదవీ విరమణ వయసు వరకు ఉద్యోగంలో కొనసాగవచ్చు. అనంతరం పింఛను, ఇతర సౌకర్యాలు వీరికి దక్కుతాయి.

ముఖ్య సమాచారం

వయసు: 17 1/2 నుంచి 21 ఏళ్లలోపు ఉండాలి. డిసెంబరు 26, 2002 - జూన్ 26, 2006 మధ్య జన్మించినవారు అర్హులు

ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ: మార్చి 31 సాయంత్రం 5 గంటల వరకు. **పరీక్ష ఫీజు:** రూ.250.

ఆన్‌లైన్ పరీక్షలు: మే 20 నుంచి.

వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/

■ e-mail: edc@eenadu.in

చదువు

9212 కానిస్టేబుల్ పోస్టులు

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) దేశవ్యాప్తంగా 9212 కానిస్టేబుల్ (టెక్నికల్, ట్రేడ్స్‌మ్యాన్) నియామకాలు చేపడుతోంది. పురుషులకు 9105; మహిళలకు 107.

పురుషుల పోస్టులు: డ్రైవర్, మోటార్ మెకానిక్ వెహికల్, కోబ్లర్, కార్పెంటర్, టైలర్, బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్, బగ్లర్, గార్డెనర్, పెయింటర్, కుక్, వాటర్ క్యారియర్, వాషర్‌మన్, బార్బర్, సఫాయి కర్మచారి. **మహిళా పోస్టులు:** బగ్లర్, కుక్, వాటర్ క్యారియర్, వాషర్ ఉమన్, హెయిర్ డ్రెస్సర్, సఫాయి కర్మచారి, బ్రాస్ బ్యాండ్.

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, హెవీ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్. దీంతోపాటు పురుషులు 170 సెం.మీ., మహిళలు 157 సెం.మీ. ఎత్తు ఉండాలి.

వయసు: 01.08.2023 నాటికి 18-23 సంవత్సరాల మధ్య ఉండాలి. డ్రైవర్ పోస్టులకు 21-27 ఏళ్ల మధ్య. **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా. **పరీక్ష ఫీజు:** రూ.100 (ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికులు, మహిళా అభ్యర్థులకు మినహాయింపు).

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 27-03-2023.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25-04-2023.

కంప్యూటర్ ఆధారిత పరీక్ష: జులై 1 నుంచి 13 వరకు.

వెబ్‌సైట్: https://crpf.gov.in/

రెండింటిలో ఏది మేలు?

బీఎడ్/ బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) రెండింటిలో ఏది చదివితే మంచిది? బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) చేస్తే ఏ ప్రభుత్వ ఉద్యోగావకాశాలుంటాయి? - శివప్రసాద్

■ బీఎడ్/ బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) రెండూ ముఖ్యమైనవే! దేని ప్రాధాన్యం దానిదే! మీకు ఏ రంగంలో స్థిరపడాలని ఉందో, ఎలాంటి విద్యార్థులకు బోధించాలని ఉందో దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయం తీసుకోండి. బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) చేసి ఆ రంగంలో స్థిరపడాలంటే ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులపై సహానుభూతి, ప్రేమ చాలా అవసరం. అలా లేని పక్షంలో మీరు కానీ, మీదగ్గర చదువుకొనే పిల్లలు కానీ సంతోషంగా ఉండలేరు. రెగ్యులర్ బీఎడ్ చేసినవారికి ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులుగా అవకాశాలుంటాయి. బీఎడ్ కోర్సు వ్యవధి రెండు సంవత్సరాలు చేశాక దీనికి కొంత ఆదరణ తగ్గింది. ప్రభుత్వ పాఠశాలల్లో శాశ్వత నియామకాలు జరగకపోవడం కూడా ఒక కారణం కావొచ్చు. బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) చేసినవారు స్పెషల్ పాఠశాలల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చు. కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం- సాధారణ పాఠశాలల్లో కూడా స్పెషల్ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించాలి. వచ్చే రెండు సంవత్సరాల్లో ఇది పూర్తిగా కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) చేసిన వారి సంఖ్య సాధారణ బీఎడ్ చేసినవారికంటే తక్కువగా ఉండటం వల్ల వీరికి ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉండే అవకాశం ఉంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

సమగ్ర కథనాలకు https://epaper. eenadu.net చూడండి.

ఈనాడు ప్రతిభ

pratibha.eenadu.net/eenadupratibha.net

ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

మాదిరి ప్రశ్నలు

■ ప్రతిష్ఠాత్మక స్లోన్ రిసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపికైన హైదరాబాద్‌కు చెందిన ఖగోళ భౌతిక శాస్త్రవేత్త ఎవరు? (మానవాళిపై ప్రభావం చూపిస్తున్న సృజనాత్మక పరిశోధకులకు ఈ ఫెలోషిప్ ఇస్తారు. ఎంపికైన వారికి రెండేళ్లపాటు సంవత్సరానికి రూ.62 లక్షల చొప్పున అందిస్తారు.)

జ: నేరెళ్ల తేజస్వి వేణుమాధవ్

■ ఆర్యసమాజ్ వ్యవస్థాపకుడు స్వామి దయానంద సరస్వతి ఎన్నో జయంతి ఉత్సవాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2023, ఫిబ్రవరి 12న ప్రారంభించారు? జ: 200

కరెంట్ అఫైర్స్

■ 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి ఎంత మొత్తంతో తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది? (పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.31,426 కోట్లు ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఏడాదికి రూ. 5 కోట్లు అభివృద్ధి నిధులను కేటాయిస్తూనే సీఎం విచక్షణ మేరకు నిధులు మంజూరు చేసేందుకు రూ.10 వేల కోట్లకు పైగా నిధులను ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) కింద చూపారు.) జ: రూ.2,90,396 కోట్లు

■ భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో 1901 తర్వాత సంభవించిన అత్యుష్ణ సంవత్సరాల్లో 2022 ఎన్నో స్థానంలో ఉంది? (19వ శతాబ్దపు సగటు ఉష్ణోగ్రత కంటే 2022లో భూ ఉష్ణోగ్రత 1.1 డిగ్రీల సెల్సియస్ అధికమని అమెరికాకు చెందిన నాసా వెల్లడించింది.)

జ: అయిదో స్థానం

■ 2022–23 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి విదేశాలకు ఎగుమతి అయ్యే రక్షణ ఉపకరణాల విలువ ఎంత మొత్తంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది? (2016–17లో భారత్ నుంచి విదేశాలకు వెళ్లిన రక్షణ ఉపకరణాల విలువ కేవలం రూ.1251 కోట్లు. 2021–22 వచ్చేసరికి అది రూ.12,815 కోట్లకు ఎగబాకింది. 2020–21లో దేశీయ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.84,643 కోట్లు. 2021–22లో పదకొండు శాతానికి పైగా వృద్ధితో అది రూ.94,846 కోట్లకు చేరింది.) జ: రూ.17 వేల కోట్లు

ఈ-బుక్స్

టీఎస్‌పీఎస్సీ ఈ-బుక్స్ ఇండియన్ పాలిటీ

వీడియోపాఠం తెలంగాణ చరిత్ర తెలంగాణ జాతరలు-ఉత్సవాలు

సాధన సంకల్పం.. సమితిగా.. సమరంగా!

అన్నదాతలపై పడిన అప్పుల భారాన్ని ఒక గళం ప్రస్తావించింది. అప్పటికే అదే పథంలో సాగుతున్న కొందరు మేధావులు తమ గొంతులు కలిపారు. మథనం జరిగింది. తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాటం దృఢమైంది. ఆ సంకల్పంలో నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. గ్రామాలు, మండలాలు, జిల్లాల్లోకి విస్తరించింది. జరుగుతున్న అన్యాయాలపై గర్జించింది. పల్లెబాట పట్టింది. చలో దిల్లీ అంటూ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను దేశ రాజధానికి చేర్చింది. జన జైత్రయాత్రగా మారింది. పాదయాత్రలతో సాగునీటి కోసం సమరాలు చేసింది. పాలికేకలతో మలిదశ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని రగిలించింది. తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావంలో అతి కీలకమైన తెరాస ఏర్పాటు, నేపథ్యం, తదనంతరం చేపట్టిన కార్యక్రమాలు, పోరాటాల గురించి అభ్యర్థులు అదే క్రమంలో తెలుసుకోవాలి, గుర్తుంచుకోవాలి.

జలదృశ్యంలో నాడు జరిగిన తెరాస ఆవిర్భావ సభలో మాట్లాడుతున్న కేసీఆర్

తెరాస పార్టీ ఆవిర్భావం-సదస్సులు-సమావేశాలు

ఆరు సూత్రాల పథకం, రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘనల నాటి నుంచే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర వాదన చాప కింద నీరులా విస్తరించింది. 1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠంగా అమలు చేయడంతో అది వెనుకబడిన తెలంగాణ ప్రాంతంపై వ్యతిరేక ప్రభావాన్ని చూపింది. ప్రధానంగా హైదరాబాద్, పరిసర జిల్లాల్లో పారిశ్రామికీకరణ వల్ల పేద రైతులు వ్యవసాయ భూములను కోల్పోయి, సొంత భూముల్లోనే వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. ప్రైవేటీకరణతో ఇక్కడి ప్రభుత్వరంగ సంస్థల్లోని ఉద్యోగులు నిరుద్యోగులయ్యారు. ప్రపంచీకరణ ఫలితంగా గ్రామాల్లోని చేతివృత్తులవారు జీవనోపాధి కోల్పోయి పొట్ట చేతపట్టుకుని హైదరాబాద్‌కు వలస వెళ్లారు. వ్యవసాయ పనులు లేక కూలీలు, ఉపాంత, సన్నకారు రైతులు ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ నగరాల బాట పట్టారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు రంగ సంస్థ (APSEB)ని మూడుగా విభజించి ప్రైవేటీకరించడంతో, వ్యవసాయ విద్యుత్తు పంపుసెట్లు ఎక్కువగా ఉన్న తెలంగాణలోని పేద రైతులపై ఆర్థిక భారం పడింది. ఈ నేపథ్యంలో 1997 మార్చిలో భువనగిరి సభ, 1997 ఆగస్టులో సూర్యాపేట మహాసభ, ఆ తర్వాత 1997 డిసెంబరులో వరంగల్ సభ తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను విస్తృతం చేశాయి.

2000 సంవత్సరంలో రాష్ట్రంలో ప్రవేశపెట్టిన విద్యుత్తు సంస్కరణలతో తెలంగాణ రైతులపై ఛార్జీల భారం గణనీయంగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో అప్పటి రాష్ట్ర విధానసభ డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగుతున్న రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి కె.చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) విద్యుత్తు ఛార్జీల పెంపుపై ముఖ్యమంత్రికి లేఖ రాశారు. దాని ప్రతిని వార్తాపత్రికలకు విడుదల చేశారు. ఈ సంఘటనతో నాటి తెలంగాణ మేధావులు, తెలంగాణ ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ జయశంకర్ నేతృత్వంలో కేసీఆర్‌ను కలిశారు. 1956 నుంచి తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై ఆయనతో చర్చించారు. దాంతో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేయాలని దృఢంగా సంకల్పించారు. 2001, ఏప్రిల్ 27న తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పార్టీని స్థాపించారు. అదే రోజున తన డిప్యూటీ స్పీకర్ పదవికి, ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేట విధాన సభ సభ్యత్వానికి, తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనే తన లక్ష్యమని ప్రకటించారు. టీఆర్ఎస్ కార్యాలయాన్ని అప్పటికే తెలంగాణ ఐక్యవేదిక ఆఫీసుగా కొనసాగుతున్న కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యంలోనే ఏర్పాటు చేశారు. తర్వాత దశలో తెలంగాణ ఐక్యవేదిక, టీఆర్ఎస్‌లో విలీనమైంది. 2001, మే 4న పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయుల్లో పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. 2001, మే 5న కేసీఆర్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని రాగూర్ ఆడిటోరియంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశమై ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ఈ సమావేశం 'ఫోరం ఫర్ తెలంగాణ' అనే సంస్థ, ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో జరిగింది. 2001, మే 11న తెలంగాణ ప్రాంతంలోని గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో ఏకకాలంలో టీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు.

తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం

కరీంనగర్ సింహగర్జన

తెలంగాణ మలి ఉద్యమ కాలంలో నిర్వహించిన మొదటి భారీ బహిరంగ సభ ఇది. కరీంనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగింది. గొట్టి భూపతి అధ్యక్షత వహించారు. ఝార్ఖండ్ ముక్తి మోర్చా నాయకుడు శిబూ సోరెన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సింహగర్జన సభలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలన్నింటినీ ప్రజలకు వివరించారు.

కరీంనగర్ సభ స్ఫూర్తితో టీఆర్ఎస్ పలు జిల్లాల్లోనూ భారీ బహిరంగ సభలను నిర్వహించింది. అవి ● 2001, జూన్ 1న-మహబూబ్ నగర్. ● 2001 జూన్ 2న-నల్గొండ. ● 2001 జూన్ 4న-నిజామాబాద్. ● 2001 జూన్ 5న-నిర్మల్. ● 2001 జూన్ 21న-వరంగల్.

ఈ భారీ సభల్లో కేసీఆర్, ప్రొఫెసర్ జయశంకర్‌లు తెలంగాణకు అప్పట్లో జరుగుతున్న అన్యాయాలు, వివక్షలను వివరించి, ప్రజలను ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం వైపు నడిపించారు. తర్వాత 2001, జులైలో నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక పంచాయతీ రాజ్ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నాగలి చిహ్నంతో పోటీ చేసింది. మంచి ఫలితాలను సాధించింది. అనంతరం 2001, ఆగస్టు 18న టీఆర్ఎస్ పార్టీ భారత ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొని రిజిస్టర్డ్ రాజకీయ పార్టీగా ఆవిర్భవించింది. కేసీఆర్ రాజీనామా చేసిన సిద్ధిపేట విధాన సభ స్థానానికి 2001, సెప్టెంబరు 22న జరిగిన ఉపఎన్నికలో మళ్లీ ఆయనే భారీ మెజారిటీతో గెలుపొందారు.

తెలంగాణ సాధన సమితి



ఆలె నరేంద్ర

భారతీయ జనతా పార్టీకి చెందిన ఆలె నరేంద్ర 2001, సెప్టెంబరు 19న తెలంగాణ సాధన సమితిని స్థాపించారు. దీని లక్ష్యం కూడా ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించడమే. అప్పటివరకు తెలంగాణ ముక్తి మోర్చా అధ్యక్షుడైన మాచినేని కిషన్ రావు, మాజీ మంత్రి సమరసింహారెడ్డి తెలంగాణ సాధన సమితిలో చేరారు. తెలంగాణ రాష్ట్ర సమితి, తెలంగాణ సాధన సమితి రెండింటి లక్ష్యం ప్రత్యేక తెలంగాణ పోరాటమే కావడంతో తెలంగాణ సాధన సమితి 2002, ఆగస్టు 11న టీఆర్ఎస్‌లో విలీనమైంది. ఆలె నరేంద్ర టీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ అయ్యారు.

తొలి పల్లె బాట: గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి 2002, సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 7 వరకు 15 రోజులపాటు టీఆర్ఎస్ తొలి పల్లె బాట కార్యక్రమాన్ని చేపట్టింది. తెలంగాణలోని అన్ని గ్రామాల్లో నిర్వహించింది.

జల సాధన ఉద్యమం: తెలంగాణ ప్రాంతానికి సాగునీటి ప్రాజెక్టుల్లో జరిగిన అన్యాయాలను నిరసిస్తూ 2002, డిసెంబరు 25 నుంచి 2003, జనవరి 5 వరకు ఉద్యమాన్ని టీఆర్ఎస్ విజయవంతంగా కొనసాగించింది. జనవరి 5న తెలంగాణ బంద్ కూడా నిర్వహించింది.

తెలంగాణ గర్జన సభ: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో 2003, జనవరి 6న భారీగా తెలంగాణ గర్జన సభను టీఆర్ఎస్ నిర్వహించింది. ఈ సభకు ఝార్ఖండ్ ముక్తి మోర్చా నాయకుడు శిబూ సోరెన్‌తో పాటు నర్మదా బచావో ఆందోళన్, నేషనల్ అలయన్స్ ఫర్ పీపుల్స్ మూవ్‌మెంట్ నాయకురాలు మేధా పాట